సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



రాజకీయ చతురులు

రాజకీయ చైతన్యానికి కేంద్ర బిందువైన షాద్‌నగర్ నుంచి ఎందరో నేతలు రాజకీయ నిచ్చెనలు ఎక్కారు. 14లో▸



‘చేయి’ కలపండి

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సోమవారం ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డికి ఇంటికెళ్లారు. 14లో▸



బలమున్నందునే పోరాటం

ప్రజా బలమున్నందునే కాంగ్రెస్ టికెట్ కోసం కొట్లాడుతున్నామని బడంగ్‌పేట మేయర్ పారిజాత అన్నారు. 14లో▸

న్యూస్‌రీల్

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న కొండా, నాయకులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం అన్నారు. మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్ ఆధ్వర్యంలో చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబపాలనను అంతమొందించేందుకు ఇదే సరైన సమయమన్నారు. చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేసేందుకు అందరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాందేవ్‌రెడ్డి, భీమేందర్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, నవీన్‌గౌడ్, లక్ష్మీపతి యాదవ్, మండపా అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి యాదయ్య



ప్రచారంలో భాగంగా కటింగ్ చేస్తున్న యాదయ్య

శంకర్‌పల్లి: పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీకే దక్కిందని చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య తెలిపారు. ప్రజాశీర్వాద యాత్రలో భాగంగా సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ తొమ్మిదన్నరేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ.. కారు గుర్తుకు ఓటువేసి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ప్రతిపక్ష పార్టీల అబద్ధపు హామీలను నమ్మి ఆగం కావద్దని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు శశిధర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేశ్, ఏఎంసీ చైర్మన్ పాపారావు, మండల అధ్యక్షుడు గోపాల్, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ యువజన విభాగం నాయకుడు కాంతిరెడ్డి, సర్పంచ్‌లు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, అశ్వినీసుధాకర్, నర్సింహారెడ్డి, రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ మలమ్మ, నాయకులురాజు, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. మల్లారెడ్డి


బహుజన సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపిక

షాబాద్: షాబాద్‌కి చెందిన యాస మల్లారెడ్డి బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ కమిటీ ఆఫ్ ఇండియా జాతీయ ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యావేత్త, సామాజిక కార్యకర్తగా, తెలంగాణ ఉద్యమకారుడిగా, ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా, పాత్రికేయ వృత్తిలో ఆయన చేసిన సేవలను గుర్తుంచి ఈ అవార్డు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నగరంలోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో సోమవారం అవార్డు సెలెక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్ బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు నాల్లా రాధాకృష్ణ, మంత్రి మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా ఆయనకు ఆహ్వానపత్రం అందజేశారు. నవంబర్ 6న నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే తెలంగాణ రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో ప్రముఖ ప్రజాకవి, రచయిత జయరాజ్, సంస్థ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ చేతులమీదగా అవార్డు అందించనున్నట్లు తెలిపారు.

బెల్టుషాప్‌లపై ఉక్కుపాదం

మహేశ్వరం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో సోమవారం నకిలీ మద్యం, బెల్టు షాపులు, నాటుసారా వంటివాటిపై దాడులు చేసి కేసులు నమోదు చేశామని మహేశ్వరం ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి తెలిపారు. మహేశ్వరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్నికల కోడ్ ఉన్నప్పటి నుంచి మొత్తం 41 కేసులు నమోదు చేసి.. 16 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. 5 లీటర్ల నాటుసారా, 1,440 లీటర్ల బెల్లం స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. 243 లీటర్ల మద్యాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేశామని ఆమె తెలిపారు. బెల్టుషాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్‌ఐలు ప్రవీణ్‌కుమార్, హన్మంతునాయక్ పాల్గొన్నారు.

ఓట్ ఫ్రమ్ హోమ్



- దివ్యాంగులు, వయోధికులకు ప్రత్యేక సదుపాయాలు
- ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం
- ఆర్‌ఓల ద్వారా పోస్టల్ బ్యాలెట్ల పంపిణీ
- పోలింగ్ కేంద్రాల్లో మూడు చక్రాల బండ్లు, సహాయకుల ఏర్పాటు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి దివ్యాంగులు, వయోధికుల కోసం ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించింది. జిల్లాకు సంబంధించి ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న దివ్యాంగ, వయోధికులకు ఆర్‌ఓల ద్వారా ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్లను సరఫరా చేసింది. నేరుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటుహక్కును వినియోగించుకునే వారి కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించింది. ర్యాంపులతో పాటు మూడుచక్రాల బండ్లను సిద్ధం చేసింది. వారికి సహాయకులను కూడా నియమించింది. ఆదర్శ పోలింగ్ కేంద్రాల్లో భాగంగా నియోజకవర్గానికి ఒక పోలింగ్ కేంద్రాన్ని కూడా ఎంపిక చేసింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 80 ఏళ్ల పైబడిన వారు 43,541 మంది ఉండగా, వీరిలో 20,989 మంది పురుషులు, 22,548 మంది మహిళలు, నలుగురు థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. ఇక వివిధ రకాల వైకల్యంతో బాధపడుతున్న ఓటర్లు 48,603 మంది ఉండగా, వీరిలో 26,516 మంది పురుషులు ఉండగా, 22,085 మంది మహిళలు ఉన్నారు. మరో ఇద్దరు థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు.

జిల్లాలోని వయోవృద్ధుల (80ఏళ్లు పైబడిన) వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్లు
ఇబ్రహీంపట్నం	1,556	2,099	0
ఎల్బీనగర్	4,515	3,902	2
మహేశ్వరం	3,407	3,585	0
రాజేంద్రనగర్	2,504	2,516	0
శేరిలింగంపల్లి	4,500	3,560	2
చేవెళ్ల	1,674	2,487	0
కల్వకుర్తి	1,432	2,345	0
షాద్‌నగర్	1,401	2,054	0

జిల్లాలోని దివ్యాంగ ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	అంధులు	లోకోమోటర్స్	మూగ, చెవిటి	ఇతర వైకల్యం
ఇబ్రహీంపట్నం	1,040	1,976	369	4,270
ఎల్బీనగర్	527	4,563	296	1,055
మహేశ్వరం	881	6,351	704	721
రాజేంద్రనగర్	621	2,172	284	1,924
శేరిలింగంపల్లి	880	1,113	459	3,565
చేవెళ్ల	469	2,825	407	650
కల్వకుర్తి	581	1,596	370	1,371
షాద్‌నగర్	450	2,272	586	3,255



మొబైల్ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ హోళికేరి

ఓటింగ్ పెంచేందుకు కృషి

- కలెక్టర్ భారతి హోళికేరి
- కలెక్టరేట్‌లో సంచార రథాలు ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు కలిసికట్టుగా పని చేయాలని కలెక్టర్ భారతి హోళికేరి తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఓటింగ్ ఆవశ్యకత, పోలింగ్‌పై అవగాహన కల్పించేందుకు జిల్లాలో నియోజకవర్గాలవారీగా ఏర్పాటు చేసిన సంచార రథాల (మొబైల్ వాహనాల)ను సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించేందుకు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఈవీఎం డెమోన్‌స్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎం, వీవీప్యాట్ వినియోగంపై ఎలాంటి సందేహాలున్నా ఈ కేంద్రాల్లో నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, జిల్లా పరిషత్ సీఈఓ దిలీప్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నోడల్ అధికారి ప్రభాకర్, ఆర్డీఓలు, అధికారులు పాల్గొన్నారు .

రోజువారీ నివేదకలివ్వండి..

ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నోడల్ అధికారులతో సోమవారం కలెక్టర్ సమావేశమయ్యారు. చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీలు పకడ్బందీగా జరిగేలా చూడాలని తెలిపారు. సామాన్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తనిఖీలు ఉండాలన్నారు. తనిఖీ బృందాలు రోజువారీ నివేదికలను ఉన్నతాధికారులకు అందించాలని తెలిపారు. నోడల్ అధికారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

మంత్రి సబితారెడ్డి



సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

పహాడీషరీఫ్: బీఆర్‌ఎస్‌తోనే మహేశ్వరం అభివృద్ధి సాధ్యమని గుర్తించి వివిధ పార్టీల నాయకులు పార్టీలో చేరుతున్నారని మంత్రి సబితారెడ్డి అన్నారు. ఆ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు యంజాల జనార్దన్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ ఎంపీటీసీ రాజు, మాజీ వార్డు మెంబర్ గిరి, రామారావు, రాజు, స్వామి, నగేష్, రవి, మంద ప్రశాంత్, రాజు, జంగయ్య, రవి, మహేందర్, శివప్రసాద్ తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరినవారిలో ఉన్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి, పెంటమ్మ, సాదిక్, గోపాల్‌రెడ్డి, ఇద్రీస్, జీవన్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వెంకటయ్య, నాయకులు

కేసీఆర్ చేతిలో తెలంగాణ బందీ

- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

షాబాద్: సోనియాగాంధీ ఇచ్చిన తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ చేతిలో బందీ అయ్యిందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డి సమక్షంలో సోమవారం షాబాద్ మండలం లక్ష్మరావుగూడకి చెందిన బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, ఆ పార్టీ సీనియర్ నాయకుడు జోగు వెంకటయ్య సహా 50 మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని.. బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి భీంభరత్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, సీనియర్ నాయకులు బాలయ్య, అనంతరెడ్డి, బుచ్చయ్య, భోజిరెడ్డి, నర్సింహారెడ్డి తదితరులున్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

- ఆర్డీఓలు అనంతరెడ్డి, వెంకట మాధవరావు
- సిబ్బందితో సమీక్షా సమావేశాలు
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని హెచ్చరిక



ఇబ్రహీంపట్నం: సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఎన్నికల సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళికి అనుగుణంగా విధులు నిర్వర్తిస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు ఇవ్వాలన్నారు. పోలింగ్ బూత్‌ల్లో ఏవైనా సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్నివిధాల చర్యలు చేపట్టాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై వేటు తప్పదని వెల్లడించారు. తహసల్దార్లు అన్వర్, ప్రసాద్‌రావు, రవీందర్‌దత్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పెరగనున్న పోలింగ్ కేంద్రాలు..!

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న 319 పోలింగ్ కేంద్రాల సంఖ్యను పెంచనున్నట్లు తెలుస్తుంది. సుమారు 334 కేంద్రాలవరకు ఈ సంఖ్య పెరిగే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తుంది. మంగళవారంతో ఓటర్ నమోదు కార్యక్రమం ముగుస్తుంది. పెరిగిన ఓటర్ల సంఖ్యను బట్టి ఈ సంఖ్య పెరుగుతుందని సమాచారం. ఇంకా అధికారులు ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. కాగా 4వ తేదీ ఓటర్ల తుదిజాబితా పూర్తిస్థాయిలో వెలువడనుంది.

నిబంధనలు పాటించాలి..

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వెంకట మాధవరావు తెలిపారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ ప్రతాప్‌లింగంతో కలిసి నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్ల అయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఈనెల 3వ తేదీ నుంచి 10 తేదీ వరకు నామినేషన్లను దాఖలు చేయవచ్చని తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు లింగారెడ్డిగూడలో ఉన్న ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు నిబంధనలను విధిగా పాటించాలని.. కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటు హక్కు నమోదు ప్రక్రియ మంగళవారంతో ముగిస్తుందని ఆర్డీఓ తెలిపారు. 18ఏళ్ల నిండిన యువతీ యువకులు, ఓటుహక్కు లేనివారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ ప్రతాపలింగం, ఎస్‌ఐలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

5న పద్మశాలీ దసరామేళా

హుడాకాంప్లెక్స్: ఎల్‌బీనగర్ సర్కిల్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నవంబరు 5న నిర్వహించే దసరా మేళాను విజయవంతం చేయాలని ఆ సంఘం అఖిల భారత అధ్యక్షుడు కందగట్ల స్వామి కోరారు. సోమవారం మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సరూర్‌నగర్‌లో ఆయన ఆవిష్కరించారు. పద్మశాలీ సమాజం ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మేళాను నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. దసరా మేళాలో ఎమ్మెల్సీ ఎల్.రమణ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మాజీ రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనంద్ భాస్కర్, జౌళిశాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరహరి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు గణేష్, రఘురాం, జగన్నాథం, శివ, జగదీష్, రాము, తులసీదాస్, శ్రావణ్ పాల్గొన్నారు.

కనులపండువగా శోభాయాత్ర



రథంపై ఊరేగుతున్న స్వరూపానంద స్వామి

షాద్‌నగర్: ఆయుత చండీ అతిరుద్ర మహాయాగంలో భాగంగా షాద్‌నగర్‌లో సోమవారం శోభాయాత్రను శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి మహబూబ్‌నగర్ రోడ్డులో నిర్వహిస్తున్న యాగశాల వరకు శోభాయాత్ర కొనసాగింది. విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై స్వరూపానంద స్వామిని ఊరేగించారు. పట్టణానికి చెందిన కళాకారుడు టీవీ రంగయ్య ఆధ్వర్యంలో రమేష్‌చారి బృందం సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, రాధాకృష్ణ వేషధారణలతో ఆకట్టుకున్నారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి

ఎంసీసీ నోడల్ ఆఫీసర్ ప్రకాశ్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల సందర్భంగా నగదు, నగలు తదితరమైన వాటికి సంబంధించి నిర్వహించే తనిఖీల సందర్భంగా స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టీ) ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని ఎంసీసీ నోడల్ ఆఫీసర్ ప్రకాశ్‌రెడ్డి సూచించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎస్ఎస్‌టీలోని వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నామినేషన్లు ప్రారంభం కానున్న నవంబర్ 3వ తేదీ నుంచి ఎస్ఎస్‌టీలు విధులు నిర్వహించాలన్నారు. తనిఖీలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ఉండాలన్నారు. ఎస్ఎస్‌టీ వాహనాలకు సీసీ కెమెరాలు, జీపీఎస్ ఏర్పాట్లు ఉంటాయన్నారు. పట్టుబడ్డ నగదుకు తప్పనిసరిగా రసీదు అందజేయాలని, లేని పక్షంలో అలాంటి వారిపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. నోడల్ ఆఫీసర్ అకౌంట్ శరత్ చంద్ర మాట్లాడుతూ.. ఎస్ఎస్‌టీ సీజ్ చేసిన వాటిని తప్పనిసరిగా రికార్డు చేయాలన్నారు.

ఉదయం బీఆర్‌ఎస్



బీఆర్‌ఎస్ కండువాతో కావలి దశరథ (సర్కిల్‌లో ఉన్న వ్యక్తి)

సాయంత్రం కాంగ్రెస్‌లోకి..



మరుసటిరోజు ప్రతాప్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువాతో కావలి దశరథ

- రాత్రికోపార్టీ..పొద్దున మరో పార్టీ మారుతున్న నాయకులు

కొందుర్గు: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వివిధ పార్టీల నాయకులు తమ పార్టీలో సరైన ప్రాధాన్యత లభించడం లేదనో, మరే ఇతర కారణంతోనో మరోపార్టీకి వలస వెళ్లడం సర్వ సాధారణమే. అయితే కొందుర్గు మండలంలో నాయకుల తీరు దీనికి భిన్నంగా ఉంది. ఎన్నికల గడువు ముంచుకొస్తుండటంతో మండల కేంద్రంలో కిందిస్థాయి నాయకులను తమపార్టీలో చేర్పించుకునేందుకు ద్వితీయ, తృతీయ స్థాయి నేతలు పోటీపడుతున్నారు. ఎవరైన చిన్నస్థాయి నాయకులు ఏదైన పార్టీలో చేరితే.. మరోపార్టీ నాయకులు వారిని బుజ్జగించడం లేదా బెదిరించడం వంటివి చేసి తిరిగి తమ పార్టీలో చేర్పిస్తున్నారు. ఇలా గ్రామీణ స్థాయి నాయకుల పరిస్థితి రాత్రికో పార్టీ కండువా వేసుకుంటే.. మరునాడు మరో పార్టీ కండువా వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆశీర్వదిస్తే.. 60 గజాల స్థలం

మహేశ్వరం స్వతంత్ర అభ్యర్థి కొత్త మనోహర్‌రెడ్డి

మీర్‌పేట: స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ 60 గంజాల ఇంటి స్థలాన్ని ఇస్తానని కేఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త మనోహర్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం ఆయన నియోజకవర్గంలోని తన మద్దతుదారులు, అనుచరులతో మీర్‌పేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేఎంఆర్ మాట్లాడుతూ.. ట్రస్ట్ ద్వారా ఇప్పటికే తన సొంత భూమిలో 3 వేల మంది నిరుపేదలకు 60 గజాలు కేటాయిస్తూ పట్టాలు పంపిణీ చేశానని గుర్తు చేశారు. నియోజకవర్గంలోని పేదల భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కుని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈ ప్రాంతానికి గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన నాయకులు పేదలకు చేసిందేమీ లేదని, స్థానికుడినైన తనను నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి స్థలంతో పాటు పేదింటి ఆడబిడ్డల వివాహాలకు సాయం చేస్తానన్నారు. ఓటు కోసం వచ్చే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలను తరిమికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌కుమార్, తిరుపతయ్య, భిక్షపతి, శంకరయ్య, నర్సింగ్, లింగమయ్య, వినయ్, రాజు, శంకరయ్య, కార్తీక్‌రెడ్డి, కుర్మయ్య, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఎందరో మహానుభావులు.. రాజకీయ చతురులు

రాజకీయ చరిత్రలో షాద్‌నగర్‌కు 1957 నుంచే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎందరో రాజకీయ ఉద్దండులను అందించిన ఘనత నియోజకవర్గానికి దక్కింది. ఏడు దశాబ్దాల చరిత్ర ఈ అసెంబ్లీ సెగ్మెంట్ సొంతం. పారిశ్రామికంగా.. రియల్ వ్యాపారంలోనూ ఈ ప్రాంతం భాసిల్లుతోంది.

- దశాబ్దాల చరిత్ర నియోజకవర్గ సొంతం
- తొలి సీఎం, ఈవీఎం ఎలక్షన్ షాద్‌నగర్ నుంచే
- 45 ఏళ్లు పాలించిన కాంగ్రెస్
- హ్యాట్రిక్ కోసం బీఆర్ఎస్


బూర్గుల రామకృష్ణారావు


ఇందిర


బక్కని నర్సింలు


శంకర్‌రావు


చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి


అంజయ్య యాదవ్


షాద్‌నగర్ వ్యూ

షాద్‌నగర్: రాజకీయ చైతన్యానికి కేంద్ర బిందువైన షాద్‌నగర్ నుంచి ఎందరో నేతలు రాజకీయ నిచ్చెనలు ఎక్కారు. ఇక్కడ నుంచి అసెంబ్లీకి పంపిన నేతల్లో హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా చరిత్రకెక్కారు.

1952లో నియోజకవర్గ ఏర్పాటు

1952లో షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటయింది. నాటి నుంచి 1962 వరకు నియోజకవర్గం జనరల్ స్థానంగా ఉండేది. నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణలో 1967 నుంచి 2007 వరకు ఎస్సీ రిజర్వుడు స్థానంగా కొనసాగింది. 2008 నుంచి జనరల్‌కు ఈ స్థానం కేటాయించారు. గతంలో ఈ నియోజకవర్గం మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఉండగా జిల్లాల పునర్విభజనలో రంగారెడ్డిలో కలిపారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో కొత్తూరు, కేశంపేట, కొందుర్గు, ఫరూఖ్‌నగర్‌తో పాటుగా కొత్తగా నందిగామ, జిల్లేడు చౌదరిగూడ మండలాలను ఏర్పాటు చేశారు.

తొలి ముఖ్యమంత్రిని అందించిన ఘనత

తొలి ముఖ్యమంత్రి రామకృష్ణారావుది నియోజకవర్గంలోని బూర్గుల స్వగ్రామం. 1899లో ఆయన నర్సింగ్‌రావు, రంగనాయకమ్మ దంపతులకు జన్మించారు. బూర్గుల రామకృష్ణారావు ఇంటి పేరు పుల్లంరాజు అయినప్పటికీ ఊరుపేరే ఇంటి పేరుగా మారింది. 1952 మార్చిలో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా శాసనసభకు ఎన్నికయ్యారు. ఈయన కమ్యూనిస్టు నేత ఎల్ఎల్ రెడ్డి పై 15వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. హైదరాబాద్ రాష్ట్రంలో బూర్గుల రామకృష్ణారావు సీఎంగా మొదటి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటయ్యే వరకు బూర్గుల సీఎంగా కొనసాగారు. ఆయన పాలనలో రక్షిత కౌలుదారు చట్టం తీసుకొచ్చి పేదలకు భూ పంపిణీ చేశారు. 1956లో విశాలాంధ్ర ఉద్యమానికి మద్దతు తెలిపి ఆయన తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం 1956–60వరకు కేరళ, 1960–62 వరకు ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా పని చేశారు.

కంచుకోటకు బీటలు

నియోజకవర్గం ఏర్పాటు నుంచి షాద్‌నగర్ కాంగ్రెస్‌కు కంచుకోటగా పేరుగాంచింది. టీడీపీకి చెందిన ఇందిర, బక్కని నర్సింలు, బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్‌లు మాత్రమే ఇక్కడ విజయం సాధించారు. హ్యాట్రిక్ సాధించేందుకు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తన ప్రచారానికి పదును పెంచారు.

ఇద్దరు మహిళా ఎమ్మెల్యేలు

నియోజకవర్గాన్ని రెండు పర్యాయాలు మహిళా ఎమ్మెల్యే పాలించారు. 1957లో కాంగ్రెస్ నుంచి షాజహాన్ బేగం స్వతంత్ర అభ్యర్థులు ఎల్.లక్ష్మారెడ్డిపై 3,423 ఓట్లతో విజయం సాధించారు. అనంతరం 1985లో టీడీపీ చెందిన ఇందిర కాంగ్రెస్ అభ్యర్థి బి.కృష్ణయ్యపై 7,018 ఓట్లతో విజయం సాధించారు.

ఈవీఎం ఇక్కడ నుంచే..

ఎన్నికల సంస్కరణలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం 1983లో ఈవీఎం ఓటింగ్ విధానాన్ని షాద్‌నగర్‌లో ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది.

వేలాది మందికి ఉపాధి

పారిశ్రామికంగా, రియల్ ఎస్టేట్ వ్యాపారంలోనూ ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందింది. సుమారు 300పైగా భారీ, మధ్య తరహా, చిన్న పరిశ్రమలు ఉన్నాయి. వేలాది మంది కార్మికులు ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి షాద్‌నగర్ సమీపంలో ఉండటంతో ఈ ప్రాంతంలోని భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతుంది.



షాద్‌నగర్ నియోజకవర్గ ముఖచిత్రం

ఆది నుంచి హస్తానిదే హవా

1952 నుంచి ఇప్పటి వరకు 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 11 సార్లు ఈ స్థానం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే హస్తగతం చేసుకున్నారు. 1983, 1989, 1999, 2004 ఎన్నికల్లో శంకర్‌రావు విజయం సాధించి మంత్రి పదవి చేపట్టారు. ఇక్కడ నుంచి టీడీపీ రెండు సార్లు, బీఆర్ఎస్ మూడుసార్లు విజయం సాధించాయి.

జంగ్ తెలంగాణ

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కొత్తూరు	27	12629	12243	1	24873
నందిగామ	27	13030	12739	2	25771
కొందుర్గు	26	11349	11307	1	22657
చౌదరిగూడ	29	12269	11753	4	24026
కేశంపేట	43	17394	17130	1	34525
ఫరూఖ్‌నగర్	100	47201	46411	6	93618
మొత్తం	252	113872	111583	15	225470

నియోజకవర్గంలో గెలిచిన ఎమ్మెల్యేలు

సంవత్సరం	పేరు	పార్టీ	మెజార్టీ
1952	బూర్గుల రామకృష్ణారావు	కాంగ్రెస్	15052
1957	షాజహాన్‌బేగం	కాంగ్రెస్	3423
1962	దామోదర్‌రెడ్డి	కాంగ్రెస్	7988
1967	నాగన్న	కాంగ్రెస్	5370
1972	జగన్నాథం	కాంగ్రెస్	13827
1978	భిష్వకిష్టయ్య	కాంగ్రెస్	9743
1983	శంకర్‌రావు	కాంగ్రెస్	3003
1985	ఇందిర	టీడీపీ	7018
1989	శంకర్‌రావు	కాంగ్రెస్	8700
1994	బక్కని నర్సింలు	టీడీపీ	45822
1999	శంకర్‌రావు	కాంగ్రెస్	6010
2004	శంకర్‌రావు	కాంగ్రెస్	10632
2009	చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి	కాంగ్రెస్	9838
2014	అంజయ్య యాదవ్	బీఆర్ఎస్	17328
2018	అంజయ్య యాదవ్	బీఆర్ఎస్	20425

ఎన్‌సీసీతో సాంస్కృతిక అనుసంధానం

శంషాబాద్ రూరల్: ఎన్‌సీసీ కార్యకలాపాలతో దేశంలోని వివిధ రాష్ట్రాల సాంస్కృతిక అనుసంధానానికి ప్రోత్సాహం కలుగుతుందని ఎన్‌సీసీ గ్రూపు కమాండర్ కల్నల్ సంజయ్‌సాయల్ అన్నారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ క్యాంపు ముగింపు వేడుకలను సోమవారం శంషాబాద్‌లోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ నెల 21 నుంచి జరుగుతున్న ఈ శిబిరం ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో పాల్గొన్న కేడెట్లను ఉద్దేశించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఎన్‌సీసీ గ్రూపు నిర్వహించిన ఈ శిబిరంలో కేడెట్లకు గ్రూపు పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు కల్నల్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

‘చేయి’ కలపండి

హస్తంలో టికెట్ దక్కిన నేతలు సొంత పార్టీలో అలకబూనిన నాయకుల మద్దతు కూడగడుతున్నారు. గెలుపే లక్ష్యంగా ముందుకు కదులుతున్నారు. గతంలో తగాదాలన్నీ పక్కన పెట్టి విజయానికి సహకరించాలని కోరుతున్నారు.

- ముదిరెడ్డి మద్దతు కోరిన మల్‌రెడ్డి
- కోదండరెడ్డి ఇంటికి వెళ్లి గెలుపునకు సహకరించాలని విజ్ఞప్తి
- నేతలందరినీ కలవమని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడి సూచన
- 15 ఏళ్ల నష్టాన్ని పూడ్చుకుందామని హస్తం శ్రేణులకు పిలుపు


ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డిని కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రంగారెడ్డి తదితరులు

యాచారం: మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సోమవారం నానక్‌రాంగూడలోని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డికి ఇంటి కెళ్లారు. కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం అభ్యర్థిగా ఆయన పేరు ఖరారవ్వడంతో పీసీసీ పెద్దల సూచన మేరకు కోదండరెడ్డిని కలిసి తన గెలుపునకు సహకరించాలని కోరారు. కాగా ఇదే స్థానం నుంచి కోదండరెడ్డి సహకారంతో.. దండెం రాంరెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో మర్రి నిరంజన్‌రెడ్డి టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నించారు. అధిష్టానం ప్రకటించిన రెండో జాబితాలో మల్‌రెడ్డి రంగారెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. దీంతో నియోజకవర్గంలో పార్టీ నేతల గ్రూప్ తగాదాలు లేకుండా చూసేందుకు తన ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే కోదండరెడ్డితో భేటీ అయ్యారు. ఈ భేటీలో ఆయన రంగారెడ్డి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అధిష్టానం ఆదేశాలను ధిక్కరించవద్దనే భావనతో మద్దతిస్తా.. టికెట్ ఆశించి భంగపడిన నిరంజన్‌రెడ్డి, రాంరెడ్డి, పార్టీ సీనియర్ నేత లక్ష్మీపతిగౌడ్‌ను కలిసి మద్దతు తీసుకుని విభేదాలుంటే పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రూపుతగాదాల కారణంగా 15 ఏళ్లుగా పార్టీ నష్టపోతోందని.. ఈ ఎన్నికల్లో ‘పట్నం’ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కోదండరెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. కోదండరెడ్డిని కలిసిన వారిలో గురునాథ్‌రెడ్డి, మహిపాల్, రాచర్ల వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాస్‌రెడ్డి, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులున్నారు.

బీఎస్పీ రెండో లిస్టు విడుదల

చేవెళ్ల/షాద్‌నగర్: తెలంగాణ ఎన్నికల బరిలో నిలుస్తున్న బీఎస్పీ ఇప్పటికే 20 మందితో మొదటి లిస్టు ప్రకటించగా.. సోమవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మరో 43 మంది అభ్యర్థులతో రెండో లిస్టు విడుదల చేశారు. ఇందులో జిల్లా నుంచి చేవెళ్ల అభ్యర్థిగా రాజా మహేంద్ర వర్మ, షాద్‌నగర్ నుంచి పసుపుల ప్రశాంత్ ముదిరాజ్‌కు అవకాశం కల్పించింది.

షాద్‌నగర్ నియోజకవర్గం


ప్రశాంత్ ముదిరాజ్

అభ్యర్థి పేరు: పసుపుల ప్రశాంత్ ముదిరాజ్
తల్లిదండ్రులు: స్వరూప, మల్లయ్య
విద్యార్హత: డిగ్రీ
పుట్టిన తేదీ: 01.01.1996
స్వగ్రామం : లక్ష్మీదేవునిపల్లి, జిల్లేడు చౌదరిగూడ మండలం
సామాజిక వర్గం: ముదిరాజ్ (బీసీ)
రాజకీయనేపథ్యం: ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకుడిగా పనిచేశారు.

చేవెళ్ల నియోజకవర్గం


రాజా మహేంద్రవర్మ

అభ్యర్థి పేరు: టి.రాజా మహేంద్రవర్మ
తల్లిదండ్రులు: వెంకటమ్మ, వెంకటయ్య
విద్యార్హత: బీఏ
పుట్టినతేదీ: 01.06.1982
భార్య : శోభ(ప్రభుత్వ ఉద్యోగి)
సంతానం: ఇద్దరు కుమారులు
స్వగ్రామం: బాకారం, మొయినాబాద్ మండలం
రాజకీయ నేపథ్యం: అంబేడ్కర్ యూత్ క్లబ్ అధ్యక్షుడిగా ఆరేళ్లు , రెండేళ్లు కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా పనిచేశారు. 2006లో బాకారం సర్పంచ్‌గా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2008–09 పీఆర్పీ మండల అధ్యక్షుడిగా పని చేశారు. మలుపు(ఎల్‌సీఐడీ సీఏపీ) సంస్థ జిల్లా అధ్యక్షుడిగా రెండేళ్లు పనిచేశారు. 2019లో బీఎస్పీలో చేరి 2019–21వరకు పార్టీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. 2021 నుంచి ఇప్పటి నియోజకవర్గ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

పార్టీలే వేరు.. ప్రత్యర్థులు వారే

- మూడో పర్యాయంలో త్రిముఖ పోటీ
- ఆసక్తికరంగా మారిన చేవెళ్ల సెగ్మెంట్ ఎన్నికలు


ఎమ్మెల్యే కాలె యాదయ్య


మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

మొయినాబాద్: జిల్లా పరిధిలోని చేవెళ్ల నియోజకవర్గ ఎన్నికలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. మూడు పర్యాయాలుగా ప్రస్తుత ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం ప్రత్యర్థులుగా కొనసాగుతున్నారు. 2009లో ఎస్సీ రిజర్వు డు స్థానమవ్వడంతో టీడీపీ నుంచి కేఎస్ రత్నం, కాంగ్రెస్ నుంచి కాలె యాదయ్య పోటీ చేయగా 2,249 ఓట్ల మెజారిటీతో రత్నం గెలుపొందారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక రత్నం ‘సైకిల్’ దిగి ‘కారె’క్కారు. అనంతరం 2014 ఎన్నికల్లో కేఎస్ రత్నం టీఆర్ఎస్ నుంచి పోటీచేయగా కాంగ్రెస్ నుంచి కాలె యాదయ్య బరిలో దిగారు. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో రత్నంపై యాదయ్య 781 ఓట్ల పై ‘చేయి’ సాధించారు. ఆ తదనంతరం ఆయన 2015లో హస్తంను వీడి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. 2018 ఎన్నికల్లో కారు టికెట్ కాలెకు దక్కడంతో కేఎస్ కాంగ్రెస్‌లో చేరి బీఫాం తీసుకున్నారు. ఈ ఎన్నికలో యాదయ్య 33,747 ఓట్ల మెజార్టీతో గెలుపొందరు. కాంగ్రెస్ నుంచి ఓడిన రత్నం కొంతకాలనికే మళ్లీ గులాబీ బాటలో నడిచారు. 2023లోనూ బీఆర్ఎస్ నుంచి కాలె యాదయ్యకు టికెట్ వరించగా.. కాంగ్రెస్ స్థానిక నాయకుడు పామెన భీంభరత్‌కు అవకాశం ఇచ్చింది. కాగా రత్నం ఇటీవలే తన అనుచరులతో కమలం గూటికి చేరారు. బీజేపీ టికెట్ ఆయనకే దక్కే అవకాశం ఉంది. మూడు పర్యాయాలుగా ప్రత్యర్థులుగా ఉన్న వారు ఈ ఎన్నికలో త్రిముఖ పోటీ ఎదుర్కొనే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రజా బలమున్నందునే పోరాటం

- కాంగ్రెస్ బీ ఫాం ఇచ్చే వరకు కొట్లాడుతాం
- కార్యకర్తల సమావేశంలో మేయర్ పారిజాత


మాట్లాడుతున్న మేయర్ పారిజాత

కందుకూరు: తాము ప్రజల నుంచి వచ్చిన నాయకులం.. ప్రజా బలమున్నందునే కాంగ్రెస్ టికెట్ కోసం కొట్లాడుతున్నామని బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి అన్నారు. సోమవారం బైరాగిగూడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతీ ఇంటికి తిరిగి ప్రజలకు భరోసా కల్పించామని కష్టపడినందునే కొట్లాడుతున్నామన్నారు. తన చివరి శ్వాస వరకు కాంగ్రెస్ కండువానే కప్పుకుంటానని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు సరికొండ మల్లేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, మహిళా అధ్యక్షురాలు ప్రశాంతిరెడ్డి, కార్పొరేటర్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్.పాండు, సీనియర్ నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, జంపన్నయాదవ్, రాఘవేందర్, సంతోషి, ఎండీ అఫ్జల్, సిద్ధు, అమృతనాయుడు, సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు, జ్యోతి, రాంరెడ్డి, వీరారెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో ‘ఆరు గ్యారెంటీ’

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, యాదగిరిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు మల్లయ్య, బుచ్చయ్య, సత్యం యాదవ్, మల్లేశ్‌గౌడ్, శ్రీను, యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.